సందడిగా పాఠశాలలు

- ముగిసిన వేసవి సెలవులు
- విద్యార్థులతో కళకళలాడిన స్కూళ్లు



తోటగరువు హైస్కూల్ తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



పాఠశాల ఆవరణలో విద్యార్థులు

ఆరిలోవ: వేసవి సెలవులు ముగిశాయి. పాఠశాలలు అన్నీ గురువారం తెరుచుకున్నాయి. తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సందడి మళ్లీ మొదలైంది. నియోజకవర్గంలో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నత పాఠశాల, కేడీపీఎం ఉన్నత పాఠశాలతో పాటు పైనాపిల్ కాలనీ, ఆరిలోవ, తోటగరువు, విశాలాక్షినగర్, పెదవాల్తేరు, ఇసుకతోట వరకు ప్రాథమిక పాఠశాలలు, శ్రీకృష్ణాపురంలో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులం, ఆరిలోవలో మదర్సాలు, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. ఎప్పటిలాగే ఉదయం పుస్తకాలు బ్యాగులు పట్టుకొని పిల్లలు ఇంటి నుంచి బయలుదేరారు. సెలవుల్లో ఆటలకు అలవాటుపడిన పిల్లలు బడికి వెళ్లడానికి కొందరు మారాం చేసినా తల్లిదండ్రులు వారి వెంటబడి పంపించారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగా ఉందని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 20 నుంచి 25 శాతం విద్యార్థుల హాజరు నమోదైంది. మధ్యాహ్నం భోజనాలు మాత్రం యథావిధిగా పాఠశాలల్లో సిద్ధం చేశారు.

తోటగరువు హైస్కూల్‌లో చురుగ్గా ప్రవేశాలు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు మొదలయ్యాయి. వేసవి సెలవులు అనంతరం గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. సమీప ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుకున్న విద్యార్థులు తోటగరువు హైస్కూల్‌లో ఆరో తరగతిలో చేరుతున్నారు. వేసవి సెలవుల్లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ విద్యార్థులు అందుబాటులో లేకపోవడంతో పది మంది కంటే ఎక్కువ ప్రవేశాలు జరగలేదు. గురువారం సుమారు 50 మంది విద్యార్థులు ఆరో తరగతిలో చేరారు. పాఠశాలలో ప్రవేశాల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆ కౌంటర్‌లో కొందరు ఉపాధ్యాయులు కొత్తగా చేరుతున్న విద్యార్థుల వివరాలను ప్రస్తుతానికి రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రవేశాలు కొద్ది రోజుల వరకు కొనసాగుతాయని పాఠశాల హెచ్‌ఎం దుర్గాభవాని తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 427 మంది పదో తరగతి విద్యార్థులు ఇక్కడి నుంచి రిలీవ్ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం సుమారు 1230 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో కొత్తగా చేరనున్న విద్యార్థులతో ఈ సంఖ్య పెరగనుందన్నారు.



తోటగరువు హైస్కూల్‌లో ప్రవేశాల కోసం పిల్లల్ని తీసుకొచ్చిన తల్లిదండ్రులు

ముడసర్లోవలో అగ్ని ప్రమాదం



ముడసర్లోవ వెనక రోడ్లలో ఎగసి పడుతున్న మంటలు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్లలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. జీవీఎంసీ నిర్మిస్తున్న నర్సరీకి ఎదురుగా రోడ్ల పక్కన నిల్వ ఉన్న చెత్త, ఇటీవల జీవీఎంసీ తొలగించిన చెట్ల కొమ్మలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో ఈ ప్రాంతంలో మంటలు ఎగసిపడ్డాయి. సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు పక్కన మంటలు, దట్టమైన పొగలు రేగడంతో ఏం జరిగిందోనని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రెండు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

క్లుప్తంగా

జైల్‌లో రక్తదాన శిబిరం



జైల్‌లో రక్తదానం చేస్తున్న అధికారులు

ఆరిలోవ: అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్, హెల్పింగ్ హర్ట్స్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్ర కారాగారంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు పి.ఎస్.రామచంద్రరావు, కమలాకరరావు, పలువురు సిబ్బంది రక్తదానం చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బీచ్ రోడ్డు: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు ఐదు హామీలపై సంతకం చేశారని, మిగతా హామీలు కూడా పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలతో కలిసి పోరాటాలు చేయటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు.

10వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రవీంద్రనగర్‌లో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డులో కాలువల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వార్డ్ కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలసి రవీంద్రనగర్‌లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ సుమారు రూ.40 లక్షలతో కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ వర్క్స్ ఏఈ వెంకటరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మద్దిల రాజశేఖర్, అప్పలనాయుడు, పేపరు నాయకుడు, సుధాకర్, మోహన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవలో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

- గెడ్డల్లో పూడికలు సకాలంలో తొలగించండి
- జీవీఎంసీ ఏడీసీ విశ్వనాథన్ ఆదేశం



జోన్–3 కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్

సీతమ్మధార: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో గురువారం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభమైనందున జోన్ పరిధిలోని ముఖ్యమైన గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలను త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు. తద్వారా వర్షపు నీరు నిల్వ ఉండకుండా సముద్రంలో నేరుగా కలిసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. మినీ పార్కుల నిర్వహణను మెరుగుపర్చాలని సూచించారు. జోన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని ఇంజినీర్లు, అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, జీవీఎంసీ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి పుష్పయాగానికి విశాఖ పూలు



సంకలనం చేసిన పూలను ప్రదర్శిస్తున్న పలువురు భక్తులు

ఎంవీపీ కాలనీ: తిరుమల శ్రీగోవిందరాజస్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పువ్వులు సేకరించారు. గురువారం ఎంవీపీలోని టీటీడీ ఈ–దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ఈ పూలను ప్రదర్శించారు. తిరుమలలో జరుగుతున్న గోవిందరాజస్వామి పుష్పయాగానికి ఈ పూలు తరలిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ తెలిపారు. కలువలు, తామరలు రకాలకు చెందిన 5 వేల పూలను సేకరించామన్నారు. ఈ పూలకు సంకల్పం చేసిన అనంతరం గురువారం సాయంత్రం తిరుమల తరలించామన్నారు.

మలేరియాపై అవగాహన అవసరం

మద్దిలపాలెం : మలేరియాపై అవగాహన అవసరమని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ బద్రేకుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీని గురువారం శివాజీపాలెం, నౌకానగర్, పెదవాల్తేరు, కాగితాల వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలుంటే దోమల ఉత్పత్తి అవకాశాలుగామారుతాయని, ఎప్పటికప్పుడు నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తాయని చెప్పారు. జ్వరం వస్తే ముందుగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షలు చేసుకోవాలని అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోనా వేణుగోపాల్, సచివాలయ ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, జీవీఎంసీ యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



నౌకానగర్‌లో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రధాన కాలువ మురుగుమయం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పలు చోట్ల కాలువలు మురుగుతో నిండిపోతున్నాయి. టీఐసీ పాయింట్ నుంచి యూనియన్ బ్యాంక్ వరకు ప్రధాన రహదారి పక్కన కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇక్కడ టిఫిన్ సెంటర్లు, పలు షాపుల ముందు కాలువపై మూతలు వేసి పూర్తిగా మూసేశారు. కొందరు పైనుంచి మురుగు రాకుండా కాలువలో రాళ్లు అడ్డంగా పెట్టేశారు. దీంతో ఈ కాలువలో చెత్త అడ్డం పడి ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో పాటు టిఫిన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను కాలువలో పడేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల వాడుక నీరు కిందకు పోవడానికి వీలులేకుండాపోతుంది. షాపుల ముందు సిమెంట్ పలకలు అడ్డుగా ఉండడంతో కాలువలో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు బయటకు తీయడానికి ఇబ్బంది పడుతున్నారు. మురుగు వల్ల దుర్వాసన రావడంతో పాటు దోమలు పెరిగిపోయి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. శానిటరీ అధికారులు స్పందించి ఈ కాలువను వెంటనే శుభ్రం చేయాలని కోరుతున్నారు.



టీఐసీ పాయింట్ వద్ద మురుగుతో నిండిన కాలువ

క్యాన్సర్ రోగులకు వైద్య సేవలందించాలి

మహారాణిపేట : మారుమూల ప్రాంతాల్లో క్యాన్సర్ రోగులను గుర్తించి వారికి వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆంధ్రా మెడికల్ కాలేజీ పరిధిలో జరిగిన క్యాన్సర్ నివారణ శిక్షణలో ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే మరికొంత కాలం పాటు ఆ వ్యక్తి బతికే అవకాశం ఉంటుందని, ఆ కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. క్యాన్సర్ రాకుండా తీసుకునే చర్యల గురించి వివరించారు. నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, మొత్తం మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు వారి పరిధిలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎస్.సమత, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త అధికారి డాక్టర్ నిర్మలగౌరి, ఏఎంసీ అంకాలజీ విభాగం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, ప్రోగ్రామ్ అధికారులు, అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన అధికారులు, గైనకాలజిస్టు, డెంటల్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

సెల్‌ఫోన్ షాపులో చోరీ

అల్లిపురం : మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల సెల్‌ఫోన్ షాపులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. క్రైం ఎస్.ఐ. సత్యారావు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా పరిషత్ జంక్షన్‌లోని ఛాందిని సెల్ పాయింట్ యజమాని వారణాసి శ్రీనివాసరావు రాత్రి 9 గంటల సమయంలో తన సెల్ షాపు మూసేసి ఇంటికి వెళ్లిపోయారు. ఉదయం 9 గంటలకు షాపుకు వచ్చి చూసేసరికి షాపు తలుపులు తీసి ఉండటంతో అనుమానం వచ్చి చూశారు. దుకాణంలో రిపేరుకు వచ్చిన 6 సామ్‌సంగ్ సెల్‌ఫోన్లు, 1 వివో సెల్‌ఫోన్, 10 బ్లూటూత్‌లు పోయినట్లు గుర్తించారు. దీంతో శ్రీనివాసరావు మహారాణిపేట క్రైం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్.ఐ. సత్యారావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. దగ్గరలో గల సీసీ కెమెరాలు పరిశీలించగా ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి షాపు లూటీకి పాల్పడినట్లు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను వేంజేంపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.



యజ్ఞోపవీతధారణ నిర్వహిస్తున్న అర్చకులు

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



పాలిశెట్టి జగ్గప్పారావు

అల్లిపురం : మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు నమోదయింది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం ఆర్‌ఆర్ వెంకటాపురం, రామాలయం వీధికి చెందిన పాలిశెట్టి జగ్గప్పారావు కోవిడ్ సమయంలో శానిటైజర్‌కు అలవాటు పడి మానసికంగా బాధపడుతున్నాడు. అతను సౌత్ జైలు రోడ్డులోని పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న భువనేశ్వరి మెకానిక్ షాప్‌లో పని చేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన గాంధీ బొమ్మ దగ్గరలో గల సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్తున్నట్లు చెప్పి సాయంత్రం 7.30 గంటల సమయంలో వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతని భార్య కళ్యాణి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త వయసు 42 సంవత్సరాలని, చామన ఛాయతో, 5 అడుగుల 7 అంగుళాల ఎత్తు, చింతపిక్క రంగు ఫ్యాంటు, స్కైబ్లూ కలర్‌పై చెక్స్ షర్టు వేసుకుని ఉన్నట్లు తెలిపింది. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 8919812412 ఫోన్ నంబర్లలో తెలిపాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రమేష్

దాబాగార్డెన్స్: రాష్ట్ర వ్యాప్తంగా మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలపై దాడి చేయడమే కాక విగ్రహాలకు టీడీపీ కండువాలు కప్పి, మసి పూస్తూ అవమాన పరుస్తున్న తెలుగుదేశం పార్టీ నేతల అరాచకాలు అరికట్టాలంటూ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్తా బత్తుల రమేష్, పార్టీ యువజన నాయకుడు సూర్య గురువారం జగదాంబ జంక్షన్‌లో గల మహానేత విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులకు సద్బుద్ధి ప్రసాదించాలని అభిలషించారు.

స్కూళ్లకు స్టూడెంట్ కిట్లు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌కు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. కొత్త ప్రభుత్వ హయాంలో సిద్ధం చేసిన స్టూడెంట్ కిట్లు కూడా పాఠశాలలో సిద్ధంగా ఉన్నాయి. నోటు పుస్తకాలు, బ్యాగు, బూట్లు, బెల్టు వంటి సామగ్రితో కూడిన ఈ కిట్లను విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రామ్ ప్రసాద్ 'సాక్షి'తో మాట్లాడుతూ స్టూడెంట్ కిట్లలో 246 మీడియం సైజ్, 181 లార్జ్ సైజ్ బెల్టులు, 733 స్కూల్ బ్యాగులు, 982 బ్రాడ్‌రూల్, 597 గ్రాఫ్, 4,538 సింగిల్ రూల్, 4153 తెలుపు నోటు పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ కిట్లను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం తమ పాఠశాలలో వెయ్యి మంది వరకు విద్యార్థులు ఉన్నారని, ఆరో తరగతిలో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నిరు. ఈ కిట్లను హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పరిశీలించి, వివరాలు నమోదు చేశారు.



ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో కిట్లు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

యువతి ఆత్మహత్య

బీచ్ రోడ్డు: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామనగర్ ప్రాంతంలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్న రాధిక(22) డిగ్రీ పూర్తి చేసింది. ఆమెకు ఇష్టం లేకుండా పెళ్లి సంబంధాలు చూస్తున్నారని మనస్తాపం చెందింది. ఈ క్రమంలో గురువారం ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పాడేరు క్షతగాత్రులకు కేజీహెచ్‌లో వైద్య సేవలు

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పలువురిని కేజీహెచ్‌కు తరలించారు. వారిలో నలుగురికి కేజీహెచ్‌లో వైద్య సేవలందిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఘటనలో గాయపడ్డ ఆదారి నితిన్‌కుమార్ (20), కె.పవన్ (19), ఎస్.గణేష్ (30), ఈఎస్‌వీ రాజు (20)కు అందుతున్న వైద్య సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పర్యవేక్షించారు. గాయపడ్డ రాజు ప్రాథమిక వైద్యం తీసుకుని కేజీహెచ్ నుంచి పరారైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో ముగ్గురికి వైద్య సేవలందిస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. బాధితులకు ఆర్థోపెడిక్, ఇతర జనరల్ వైద్యులు సేవలందిస్తున్నారు.



గాయపడ్డ వ్యక్తితో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ: రుషి గాయత్రి యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 16 నుంచి 14 రోజుల పాటు ఈ శిబిరం కొనసాగనుంది. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 94403 95439 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో నూతన వైద్య సేవలు



లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి భవనం

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్‌మెంట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆస్పత్రి ట్రస్టీ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికాలో పేరుగాంచిన డాక్టర్ గౌరీభవన్ పోతిని పర్యవేక్షణలో రోగులకు వైద్య సేవలు అందజేస్తామని చెప్పారు. సంప్రదాయక నొప్పి నిర్వహణ మాదిరిగా కాకుండా ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్‌మెంట్ పద్ధతి విధానాల ద్వారా స్టెరాయిడ్ ఇంజక్షన్లు, ఇతర చికిత్సలు ఉంటాయన్నారు. పలు రకాల సమస్యలకు 70 అల్ట్రా సోనోగ్రఫీ ద్వారా ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బొటులినుమ్ టాక్సిన్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమామహేశ్వరరావు కోరారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇస్తున్నామని అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ ట్రేడ్‌లలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడుకు పదో తరగతి, ప్లంబింగ్ ట్రేడుకు 8వ తరగతి పాసైన వారు అర్హులన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాలు ఉండాలన్నారు. మూడు నెలలపాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ కేంద్రంలో, లేదా 91332 42666, 83090 03957 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.